
సాక్షి ప్రకాశం

సోమవారం। 15। జులై। 2024



చదువుల పాదరిల్లు

పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆహ్లాదకర వాతావరణంలో సకల సౌకర్యాలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతోంది. - 8లో..



ప్రతిభను గుర్తించి లక్ష్యాన్ని చేరుకోవాలి

విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి లక్ష్యాన్ని చేరుకోవాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 30/26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

జిల్లాలో 148.2 మి.మీ వర్షం

- 27 మండలాల్లో వర్షపాతం నమోదు
- సరాసరిన 3.8 మి.మీ వర్షం

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో మూడు రోజుల నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. జిల్లాలోని 27 మండలాల్లో ఆదివారం 148.2 మి.మీ వర్షం కురవగా సరాసరిన 3.8 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అందులో గిద్దలూరులో 22.4, కొమరోలులో 17.6, వెలిగండ్లలో 13.2, పీసీపల్లి 10.2, కంభంలో 8.0, రాచర్లలో 7.8, బేస్తవారిపేటలో 7.4, జరుగుమల్లిలో 7, పామూరులో 6.4, కొనకనమిట్లలో 6.2, తర్లుపాడులో 4.8, కొండపిలో 4.2, కనిగిరిలో 3.2, సీఎస్ పురంలో 3.2, టంగుటూరులో 2.8, మార్కాపురంలో 2.8, ఒంగోలులో 2.4, ఒంగోలు అర్బన్‌లో 2.4, ఎస్ఎన్‌పాడులో 2.4, సింగరాయకొండలో 2.4, దర్శిలో 2.2, చీమకుర్తిలో 2, కొత్తపట్నంలో 1.8, అర్ధవీడులో 1.8, పెద్దారవీడులో 1.4, పొన్నలూరులో 1.2, కురిచేడులో 1 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

మత్తు ప్రయోగం సంగతేంటో తేల్చండి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ఒంగోలు టౌన్: ఉలవపాడుకు చెందిన విద్యార్థికి తోటి స్నేహితులే కూల్ డ్రింక్‌లో మత్తు మందు కలిపి ఇచ్చినట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో విద్యార్థులను కేంద్రంగా చేసుకొని మాదక ద్రవ్యాల వ్యాపారస్తులు చెలరేగుతున్నట్లు తెలిసిపోతోందన్నారు. ఒంగోలు నగరంలో మత్తు పదార్థాల వ్యాపారం ముమ్మరంగా సాగుతోందని, దానికి బానిసలైన విద్యార్థులు, యువకులు తరచుగా రోడ్లపైకి వచ్చి వీరవిహారం చేస్తున్నారని, వాహనాలను వేగంగా నడుపుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని వివరించారు. మత్తుకు బానిసలైన యువకులు గొడవలకు దిగి రచ్చ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వనమంటే..వణుకు



నల్లమల అభయారణ్యంలో సంచరించే చిరుతలు మనుషులపై దాడి చేస్తున్న వరుస సంఘటనలు గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. స్వేచ్ఛగా అడవిలోకి వెళ్లి ఫలసాయాన్ని తెచ్చుకునే గిరిజనులు అడవిలోకి వెళ్లాలంటేనే జంకుతున్నారు. గతంలో ఎప్పుడూ చిరుతలు మనుషుల మీద దాడిచేసిన ఘటనలు జరిగిన దాఖలాలు లేవు. అయితే ఇటీవలి వరుస ఘటనలు అటవీ సమీప గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

- నల్లమలలో చిరుతల వరుస దాడులు
- పచ్చర్ల సంఘటనతో ఉలిక్కిపడిన గిరిజనులు
- రెండు రోజుల క్రితం శ్రీశైలం టోల్‌గేట్ వద్ద చిరుత సంచారంతో కలకలం
- వరుస సంఘటనలతో సరిహద్దు ప్రాంతాల్లో భయాందోళనలు
- ప్రత్యేక పరిస్థితుల్లోనే చిరుత దాడి చేసి ఉండొచ్చంటున్న అధికారులు

పెద్దదోర్నాల: నల్లమల అటవీ ప్రాంతంలో నంద్యాల జిల్లా పరిధిలో ఉన్న పచ్చర్ల సమీపంలో పదిహేను రోజుల క్రితం అడవిలో కట్టెల కోసం వెళ్లిన మహిళపై చిరుత దాడి చేసి చంపటం అటవీ సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర అలజడిని రేకెత్తించింది. దీంతో పాటు చంపిన మహిళ మృతదేహాన్ని చిరుత భక్షించిందన్న వార్తలతో స్థానిక గిరిజనులు హడలిపోతున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు అటవీ ప్రాంతంలోకి వెళ్లి అటవీ ఫలసాయాన్ని సేకరించే తమకు ఈ సంఘటన అత్యంత భయాందోళన కలిగిస్తోందంటూ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిరుత మహిళపై దాడి చేయటంతో అది మ్యాన్ ఈటర్‌గా మారి ఉంటుందన్న పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దశాబ్దాల నల్లమల అభయారణ్య చరిత్రలో ఇలా చిరుతలు మనుషులను చంపి తినటం జరగలేదని గిరిజనులు చెబుతున్నారు. అంతకు ముందు పచ్చర్ల సమీపంలోనే రైల్వే పనులు చేస్తున్న మరో మహిళపై చిరుత దాడికి పాల్పడగా, వారం రోజుల క్రితం పచ్చర్ల చెక్‌పోస్టు వద్ద మరో యువకుడిపై చిరుత దాడి చేసి గాయపర్చటం, మహానంది ఆలయం పరిసరాల్లో చిరుత సంచరించటం వంటి వార్తలు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. దీంతో పాటు గురువారం రాత్రి శ్రీశైలం టోల్ గేట్ వద్ద ఓ కుక్కను చిరుత పట్టుకెళ్లిన వీడియోలు వైరల్‌గా మారి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి.

నీటి కోసమే అడవులను దాటుతున్నాయా..

నల్లమల దట్టమైన అటవీప్రాంతం కావడంతో పెద్ద పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, దుప్పులు, జింకలు తదితర ఎన్నో జంతువులు ఉన్నాయి. అంతటి ప్రాధాన్యం ఉన్న ఈ ప్రాంతంపై అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. మూడు జిల్లాలకు ప్రధాన కార్యాలయంగా ఉన్న శ్రీశైలం పరిసర ప్రాంతాల్లోనే చిరుత పులులు ఎక్కువగా సంచరిస్తున్నాయన్న విషయం చర్చనీయాంశంగా మారింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రస్తుతం చెక్‌డ్యాంలు, సాసర్‌పిట్లలో నీరులేక అవి చాలా చోట్ల నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో తాగునీరు లేకపోవడంతో చిరుతలు బహిరంగ ప్రదేశాల్లోకి వచ్చేస్తున్నాయి.

చిరుతలు స్వేచ్ఛా జీవులు:

తెలుగు రాష్ట్రాల విభజన తరువాత పెద్ద పులులు అభయారణ్యం ఆంధ్రప్రదేశ్‌లోకే అధికంగా చేరింది. ఫలితంగా పులులు, చిరుతల సంఖ్య కూడా మనరాష్ట్రంలోనే ఎక్కువ. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి దేశవ్యాప్త పులుల గణన జరుగుతుంది. ఈ క్రమంలో మన రాష్ట్రంలోని అభయారణ్యంలో 83 కు పైగా పెద్దపులులు, లెక్కకు మించి చిరుతలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. చిరుత పులులు స్వేచ్ఛా జీవులని, పెద్దపులిలా ఒక పరిధిని ఏర్పరచుకొని అవి ఒక చోట ఉండవని... ఎక్కడంటే అక్కడ సంచరిస్తూ ఉంటాయని పేర్కొంటున్నారు.

గూడెం సమీపంలో తిరుగుతుంటాయి



చిరుతలు మా గూడెం సమీపంలో సంచరిస్తుంటాయి. అప్పుడప్పుడూ మా గూడెంలోని కుక్కలను ఎత్తుకెళ్తుంటాయి. మనుషుల మీద దాడి చేయలేదు. మహిళ మీద దాడి చేసిన దగ్గర నుంచి జాగ్రత్తగా ఉంటున్నాం.

– దాసరి రామయ్య, గిరిజనుడు, పెద్దచేమ గిరిజనగూడెం

అటవీ ప్రాంతంలో జాగ్రత్తగా ఉంటున్నాం



అటవీ ప్రాంతంలో మరింత జాగ్రత్తగా ఉంటున్నాం. గతంలో భయం లేకుండా తిరిగే వాళ్లం. మహిళపై దాడి జరిగిన నాటి నుంచి అప్రమత్తంగా ఉంటున్నాం. ఒంటరిగా అడవిలోకి వెళ్లటం లేదు.

– పులిచర్ల నాగన్న, గిరిజనుడు, చింతలగిరిజనగూడెం

చిరుతల వల్ల అపాయం లేదు

చిరుత పులుల వల్ల ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదు. నల్లమల అభయారణ్య పరిసర ప్రాంతాల్లో నివసించే గిరిజనులు ధైర్యంగా ఉండవచ్చు. పచ్చర్ల సంఘటనలో ప్రత్యేక పరిస్థితుల్లోనే మహిళపై దాడి జరిగి ఉండవచ్చు. కట్టెల కోసం అడవికి వెళ్లిన మహిళ కట్టెలు ఏరుకునే క్రమంలో ఆమె కదలికలు మరో జంతువును పోలిన కదలికలుగా ఉండి ఉండవచ్చు. అందువల్లే చిరుత దాడి చేసి ఉంటుంది. నల్లమల అభయారణ్యంలో పెద్దపులులు, చిరుతలు మ్యాన్ ఈటర్‌లుగా మారిన సంఘటనలు జరుగలేదు.

– విశ్వేశ్వరరావు, ఫారెస్ట్ రేంజి అధికారి, పెద్దదోర్నాల

నత్తనడకన విద్యా ప్రవేశం

- నెలదాటినా 42.7 శాతమే రిజిస్ట్రేషన్ పూర్తి
- లక్ష్యాన్ని చేరుకోవడంలో వెనుకంజ
- ఈనెల 12 నాటికి 951 మంది మాత్రమే చేరిక
- మొత్తం చేరాల్సిన వారి సంఖ్య 2226 మంది ప్రధానోపాధ్యాయులు
- 80 మందికి 43 మంది ఎంఈవోలు మాత్రమే చేరిక



దీక్షా యాప్

ఒంగోలు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విద్యా ప్రవేశ కార్యక్రమం జిల్లాలో నత్తనడకన సాగుతోంది. ప్రధానోపాధ్యాయులకు తమ పాఠశాల పరిసరాలు, ఆవాసాల పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడంతోపాటు బడి బయట పిల్లలు అందరినీ బడిలో చేర్పించాలనే ఆసక్తి, నూతన ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు వారు చేస్తున్న కృషి అంతా ఈ విద్యా ప్రవేశ కార్యక్రమంలో ఉంది. ఇందుకుగాను జిల్లాలో ఉన్న 2226 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇందులో రిజిస్టర్ కావాల్సి ఉంటుంది. వీరు కాకుండా మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు, ఏఎంవో, సీఎంవోలు వెరసి 80 మంది రిజిస్టర్ కావాలి. కానీ ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రారంభమై నెలరోజులు దాటినా 42.7 శాతం మంది ప్రధానోపాధ్యాయులు మాత్రమే రిజిస్టర్ చేసుకోగా, ఎంఈవోలు కూడా 54 శాతానికి మాత్రమే పరిమితం కావడం గమనార్హం.

ప్రధానోపాధ్యాయుల రిజిస్ట్రేషన్ 42.7 శాతమే:

జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 2226 మందిని ఈ విద్యా ప్రవేశ కార్యక్రమంలో చేర్చాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ మేరకు అందరు ప్రధానోపాధ్యాయులకు ఎప్పటికప్పుడు మార్గదర్శకత్వం చేస్తూ వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. వీరంతా దీక్షా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, లాగిన్ కావడంతోపాటు అందులో ఎప్పటికప్పుడు వచ్చే కోర్సులకు సంబంధించిన వివరాలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ప్రాథమిక పాఠశాలలకు ఈనెల 20వ తేదీ వరకు, ఉన్నత పాఠశాలలకు ఈనెల 25వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు గడువు ఉంది. కానీ ఇప్పటి వరకు 2226 మంది ప్రధానోపాధ్యాయులకుగాను రిజిస్ట్రేషన్ చేసుకున్న ఉపాధ్యాయుల సంఖ్య కేవలం 951 మంది (42.7 శాతం) మాత్రమే. కానీ ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన ప్రధానోపాధ్యాయుల సంఖ్య 1275 (52.3 శాతం) ఉండడం గమనార్హం. తమ తమ పాఠశాలల పరిధిలో విద్యా ప్రవేశానికి సంబంధించి నిర్వహించిన ర్యాలీల వివరాలను కూడా నమోదు చేయాలి.

ఎంఈవోలు సరేసరి:

ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీ చేయడం, పరిపాలనా పరంగా ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలిచ్చే మండల విద్యాశాఖ అధికారులు కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లాలో ప్రతి మండలానికి ఇద్దరు మండల విద్యాశాఖ అధికారులున్నారు. అంటే మొత్తంగా 76 మంది ఉన్నారు. వీరు కాకుండా ఇద్దరు ఉప విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్షలోని ఒక ఏఎంవో, మరో సీఎంవోలు ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. వీరు కూడా తమ పరిధిలోని పాఠశాలల వివరాలు, విద్యార్థుల వివరాలు, బడి బయట పిల్లలు ఎంతమంది బడిలో చేరింది, నూతన ప్రవేశాల సంఖ్య వంటి అనేక ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. రోజుకు రెండు చొప్పున వీటిని పూరించేందుకు కనీసంగా గంట సమయం పడుతుందని అంచనా. అయితే వీరిలో కూడా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కేవలం 53.75 శాతం అంటే 43 మంది మాత్రమే పూర్తిస్థాయి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంకా 37 మంది రిజిస్ట్రేషన్ కూడా చేసుకోలేదు.

నేటికి వంద శాతం రిజిస్ట్రేషన్ కావాలని ఆదేశించాం

విద్యా ప్రవేశం రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం నాటికి వంద శాతం పూర్తిచేయాలని ఆదేశించాం. దీనిపై ప్రత్యేకంగా సమగ్రశిక్ష నుంచి కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ (సీఎంవో) పర్యవేక్షిస్తున్నారు. వెంటనే ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు అందరూ తమతమ పరిధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియతోపాటు వారికి వచ్చిన కోర్సులకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలను పంపాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.

– డి.సుభద్ర, డీఈవో



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలి

- అమ్మకు వందనం అంటూ సున్నం పూశారు
- రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలి
- ఉచిత ఇసుక అంటూ మోసగించి డబ్బు తీసుకోవడమే మీ పాలన..?
- దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: గత ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌లో భాగంగా చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తల్లికి వందనం అని మీఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు లెక్కన ఇస్తామని చంద్రబాబు ప్రచారం చేశారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ఎన్నికలు ఒక తల్లికి మాత్రమే రూ.15 వేలు ఇస్తామని అంటున్నారని.. ఇటువంటి మాట ఇచ్చి తప్పే నాయకుడికా మేము ఓట్లేసిందని రాష్ట్ర ప్రజలు, మహిళా లోకం మండిపడుతోందన్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే జీఓను మార్చుకుని చెప్పిన మాట ప్రకారం ఎంతమంది విద్యార్థులు ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఓ వైపు డబ్బు తీసుకుంటూ ఇసుక ఉచితం అని ఎలా అంటారు:

జిల్లాలో మూడు రీచ్‌లు మాత్రమే ఉన్నాయని అక్కడ ఇసుక లేక నెల్లూరు నుంచి తీసుకు రావాల్సి వస్తోందని బూచేపల్లి చెప్పారు. కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు ఇసుక ఫ్రీ అన్నారన్నారు. కానీ అక్కడ ఇసుక టన్నుకు రూ.370 కట్టించుకుంటున్నారని చెప్పారు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. జేసీబీ ద్వారా ఇసుకను లారీలోకి ఎత్తాలంటే రూ.300, ట్రాక్టర్‌కు అయితే రూ.100 ఖర్చు అవుతుంది... రూ.7400 ఎందుకు ఇవ్వాలని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. అదికూడా కూటమి నేతలు వస్తేనే ఇసుక ఇస్తున్నారని మిగిలిన వారు వస్తే ఇసుక ఎత్తడం లేదన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ఇన్ని రకాలుగా ప్రజలను మోసగిస్తున్నారని మండిపడ్డారు. అందరికీ ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, ఉద్యోగాలు లేనివారికి ప్రతినెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని చెప్పారు. తమ నియోజకవర్గంలో సుమారు 10 వేల మంది నిరుద్యోగులు ఉన్నారని, వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. 19 నుంచి 50 ఏళ్లు ఉన్న మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని తమ నియోజకవర్గంలో సుమారు 70 వేల మంది మహిళలు ఆ హామీ ఎప్పుడు అమలు చేస్తారా అని ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకుని ప్రజలను మోసం చేయకుండా ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, ఎంపీపీ సుధాఅచ్చయ్య, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్‌లు కేవీరెడ్డి, షేక్ షకీలా అమీన్‌బాషా, కౌన్సిలర్ మేడం మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి, ఎంపీపీ మేరువ సుబ్బారెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, సొసైటీ అధ్యక్షుడు గోగుల మూడి లింగారెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా మాజీ కన్వీనర్ నుసుం నాగిరెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశం జయసింహారావు, కర్ణా భాస్కర్‌రెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆందోళన చెందొద్దు..అండగా ఉంటాం



చెక్కును అందచేస్తున్న అన్నా, జంకె తదితరులు

- మాజీ ఎమ్మెల్యే అన్నా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె
- టీడీపీ శ్రేణుల రాళ్లదాడిలో గాయపడిన కార్యకర్తలకు భరోసా

తర్లుపాడు: అభద్రతా భావంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని గానుగపెంటలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై టీడీపీ శ్రేణులు జరిపిన రాళ్లదాడిలో గాయపడిన పార్టీ కార్యకర్తలను ఆదివారం కలిసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారు మాట్లాడుతూ ఎవరికి దెబ్బ తగిలినా రక్తమే వస్తుందని, అవతలి వారు అది గమనించాలని కోరారు. అక్రమ కేసులు పెట్టినా, దౌర్జన్యాలకు పాల్పడినా న్యాయపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలని ఆశిస్తున్నట్టు చెప్పారు. గాయపడిన బీ కొండయ్య, ఎ బాలవెంకటేశ్వర్లు, పీ రాజులకు సానుభూతి తెలిపి సీఎం వైఎస్ జగన్ అందించిన ఒక్కొక్కరికి రూ.50 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి, స్థానిక సర్పంచ్ తిరుపతమ్మ, వైస్ ఎంపీపీ చెన్నకేశవులు, పోతలపాడు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ రామిరెడ్డి, నాగెళ్లముడుపు సర్పంచ్ అంజయ్య, పార్టీ నాయకులు దాసయ్య, శేషయ్యలతో పాటు స్థానిక వైస్ సర్పంచ్ కొమ్ము నరసమ్మ, నాయకులు బాలయ్య, పీ గురవయ్య, లింగాల శ్రీనివాసులు, ఏ గురవయ్య, వీర్ల బొలిగుండు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా విధానంలో లోటుపాట్లు చర్చించండి



సమావేశంలో పాల్గొన్న ఆపస్ నాయకులు

ఒంగోలు: విద్యావిధానంలోని లోటుపాట్లు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర సంఘటన కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాలలు ప్రారంభమైనందున బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు 117 ఉపసంహరించుకుని మూడు, నాలుగు, అయిదు తరగతులను ప్రాథమిక పాఠశాలలో కలపాలన్నారు. ప్రాథమిక విద్యను మాతృభాషలో బోధించాలని, 9,10 తరగతుల హిందీ పుస్తకంపై పునరాలోచన చేయాలన్నారు. మనది హిందీ ప్రాంతం కాబట్టి సులభతరమైన హిందీ ప్రవేశపెట్టాలని, డిజిటల్ లెసన్ ప్లాన్స్ వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుడు స్వేచ్ఛగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రతి దాంట్లోను రాజకీయ జోక్యం కూడదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు 60 మేరకు ప్రాథమికోన్నత పాఠశాలలకు మంజూరు చేసిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలన్నారు.

మండల విద్యాశాఖ అధికారి 1, 2కు సమాన పని విభజన చేయాలని, అంతర్‌జిల్లా బదిలీలు, అంతర్ రాష్ట్ర బదిలీలు కూడా చేపట్టాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను దూరంగా ఉంచాలన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగ ఉపాధ్యాయులపై ఉన్న కేసులన్నింటినీ ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అధ్యక్షుడు కె.మల్లిఖార్జునరావు, ప్రధాన కార్యదర్శి టి.దిలీప్ చక్రవర్తి, సంపర్క అధికారి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా బాధ్యులు బి.గుణప్రసాద్, వి.చంద్రశేఖర్, నరశింహారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ తీగలు తగిలి గేదె మృతి


మృతిచెందిన గేదె

కంభం: విద్యుత్ తీగలు తగిలి గేదె మృతిచెందిన సంఘటన కంభం మండలంలోని రావిపాడు గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికుడు గుమ్మా వెంకటపతికి చెందిన గేదె పొలాల్లో మేతకు వెళ్లిన సమయంలో కిందపడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై మృతిచెందింది. సుమారు లక్షన్నర విలువ చేసే గేదె మృతి చెందిందని, తనకు నష్టపరిహారం ఇప్పించాలని వెంకటపతి కోరుతున్నాడు.

ట్రాక్టర్ బీభత్సం


ట్రాక్టర్ ఢీకొనడంతో ధ్వంసమైన బోరింగ్ పంపు


కొమరోలు: రాత్రి సమయంలో ఓ ట్రాక్టర్ బీభత్సం సృష్టించింది. ఈ సంఘటన కొమరోలు పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద వినాయకస్వామి దేవాలయం పక్కన శనివారం రాత్రి చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ ప్రధాన రహదారిపై వేగంగా తోలాడు. ఒక్కసారిగా గోపాలునిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలోకి వచ్చి రోడ్డు పక్కనున్న బోరింగ్‌ను ఢీకొట్టింది. అనంతరం అక్కడే ఉన్న కూల్‌డ్రింక్ స్టాల్‌ను ఢీకొట్టి మరింత వేగంగా వెళ్లిపోగా, సమాచారం అందుకున్న పోలీసులు ట్రాక్టర్‌ను వెంబడించి పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌తో పాటు పోలీసు స్టేషన్‌కు తరలించారు.

దొంగలను పోలీసులకు పట్టించిన గ్రామస్తులు

మార్కాపురం రూరల్: మండలంలోని తిప్పాయపాలెం గ్రామ శివారులో ఆదివారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే రాగి వైర్లను దొంగతనం చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరిని గ్రామస్తులు పట్టుకుని మార్కాపురం రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. కంభం మండలం కందులాపురం గ్రామానికి చెందిన కే అల్లూరయ్య, ముండ్లమూరు మండలం పసుపుగల్లు గ్రామానికి చెందిన బేల్దారి కె.వెంకటేశ్వర్లు ఆదివారం తిప్పాయపాలెం గ్రామ శివారులోని పొలాల్లో ఉన్న రైతుల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ సరఫరా కట్ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైర్లు తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా, గ్రామస్తులు గుర్తించి పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు.


సమావేశపు హాలు


బాలికల మరుగుదొడ్లు


ఆర్‌ఓ వాటర్ ప్లాంట్

చదువుల పొదరిల్లు..!

- సకల సౌకర్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల
- రూ.38 లక్షల నాడు–నేడు నిధులతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆధునికీకరణ
- ఆహ్లాదకర వాతావరణం ప్రత్యేకం
- కార్పొరేట్ స్థాయిలో వసతులు
- ఉన్నత స్థాయిలో పలువురు పూర్వ విద్యార్థులు

పొదిలి: విశాలమైన భవనాలు.. లోపలికి ప్రవేశించగానే చల్లటి వాతావరణం.. ఏపుగా పెరిగిన చెట్లు.. పరిశుభ్రమైన తరగతి గదులు.. కలర్‌ఫుల్‌గా బెంచీలు.. వాటి నిండుగా విద్యార్థులు.. ప్రత్యేక ఆకర్షణగా డిజిటల్ క్లాస్ రూంలు.. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపించే సీనియర్ అధ్యాపకులు, ప్రిన్సిపాల్.. కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు.. కష్టపడి చదివి పేరు తెచ్చే విద్యార్థులు.. ఇవన్నీ పొదిలి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రత్యేకతలు. జూనియర్ కళాశాలల్లో జిల్లాలోనే రెండో స్థానంలో కొనసాగుతున్న ఈ కళాశాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.38 లక్షల నాడు–నేడు నిధులతో ఆధునికీకరించి మరిన్ని హంగులు సమకూర్చారు. చదువుల పొదరిల్లుగా తీర్చిదిద్ది పొదిలి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నారు.

ప్రోత్సాహంతోనే మంచి మార్కులు



మంచి బోధనతో పాటు ప్రిన్సిపాల్ నుంచి అధ్యాపకుల వరకు అందరూ నిత్యం ప్రోత్సాహం ఇవ్వడంతోనే మంచి మార్కులు సాధించాను. సెకండ్ ఇయర్‌లో కూడా మంచి మార్కులు పొంది కళాశాలకు పేరు తేవాలని లక్ష్యంగా చదువుకుంటున్నాను. సౌకర్యాల ఏర్పాటుతో పాటు ప్రత్యేకంగా బాలికలకు శానిటరీ నాప్‌కిన్ బర్నింగ్ మిషన్ ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంది. పేద కుటుంబాల వారికి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరం లాంటిది. – వైష్ణవి

నాడు–నేడు నిధులతో సమకూరిన సౌకర్యాలివీ...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనేక సౌకర్యాలు కల్పించారు. రూ.34 లక్షలతో తరగతి గదులకు మరమ్మతులు చేశారు. రంగులు, నూతన బెంచీలు, ఇతర ఫర్నిచర్ కొనుగోలు చేశారు. బాలబాలికలకు వేరువేరుగా అధునాతనంగా మరుగుదొడ్లు నిర్మించారు. డైనింగ్ హాలు, హ్యాండ్ వాష్, రూ.7 లక్షలతో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్, ప్రతి తరగతి గదికి ఐదు ఫ్యాన్లు, ఐదు ట్యూబ్ లైట్లు అమర్చారు. బాలికల మరుగుదొడ్లలో శానిటరీ నాప్‌కిన్స్ బర్నింగ్ మిషన్ సైతం ఏర్పాటు చేశారు.

ఉన్నత స్థానాల్లో కళాశాల పూర్వ విద్యార్థులు...

కళాశాల పూర్వ విద్యార్థులు పలువురు ఉన్నత స్థానాల్లో, ఉద్యోగాల్లో కొలువుదీరారు. ముల్లా అహ్మద్ బాషా బాబా అటమిక్ రీసెర్చ్ సెంటర్‌లో శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. సెంటర్ తరఫున పరిశోధనల కోసం ఫ్రాన్స్ వెళ్లారు. శివరామ్ అనే పూర్వ విద్యార్థి రైల్వేస్టేషన్ మాస్టర్‌గా, వెంకట్రావు టీసీగా, చెంచులక్ష్మి ఉన్నత స్థాయి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, శివశంకర్ ఎయిర్ ఫోర్స్‌లో ఉన్నత ఉద్యోగిగా కొలువుదీరి సేవలందిస్తున్నారు. ఇంకా ఎంతో మంది ఉపాధ్యాయులుగా, ఎస్సైలుగా, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, వ్యాపారులుగా, వ్యవసాయశాఖ, వైద్య ఆరోగ్యశాఖలో అధికారులు, ఉద్యోగులుగా పనిచేస్తూ కళాశాలకు మంచిపేరు తీసుకొస్తున్నారు.


బైపీసీ తరగతి గది

కళాశాల ప్రత్యేకతలు...

కళాశాలలో అధునాతన గ్రంథాలయం, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన అన్ని వస్తువులతో ప్రయోగశాలలు, కేరీర్ గైడెన్స్‌తో పాటు ప్రత్యేక తరగతుల నిర్వహణ, బాలురకు హాస్టల్ వసతి, సువిశాలమైన క్రీడా స్థలం, కళాశాల ఆవరణలో 400 వృక్షాలతో ఆహ్లాదకరమైన వాతావరణం, క్రమ తప్పకుండా ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహణ జరుగుతోంది.

అందుబాటులో అన్ని కోర్సులు...

కళాశాలలో బైపీసీ, ఎంపీసీ తెలుగు, ఇంగ్లిష్ మీడియంలు, సీఈసీ, హెచ్‌ఈసీ తెలుగు మీడియంతో పాటు ఒకేషనల్ కోర్సు ఉన్నాయి. 300 మందికిపైగా బాలబాలికలు చదువుకుంటుండగా, 16 మంది అధ్యాపకులు, కార్యాలయ సిబ్బందితో కళాశాల నిత్యం కళకళలాడుతుంటుంది. అధ్యాపకుల బోధనలను, సౌకర్యాలను ఉపయోగించుకుని విద్యార్థులు చదువులో ప్రతిభ చాటుతున్నారు. పి.వైష్ణవి అనే విద్యార్థిని బైపీసీ విభాగంలో 422/440 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో పేరు తెచ్చుకుంది. ఎంపీసీలో ఎస్.రేవతి 418/470 మార్కులు సాధించింది. సీఈసీలో ఆనంద్‌బాబు 914/1000 మార్కులతో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సంపాదించాడు. హబీబుల్లా చారిటబుల్ ట్రస్టు తరఫున కళాశాల టాపర్‌కు, 30 మంది పేద విద్యార్థులకు రూ.50 వేల ప్రోత్సాహకాలను కరీముల్లా బేగ్ అందజేస్తున్నారు.

నాణ్యమైన బోధన, నిరంతర పర్యవేక్షణ



మా కళాశాలలో అందరూ సీనియర్ అధ్యాపకులైనందున నాణ్యమైన విద్యా బోధన జరుగుతోంది. బోధన, సౌకర్యాలు, విద్యార్థుల నడవడిక, చదువుల తీరును నిరంతరం పర్యవేక్షిస్తుంటాము. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఐఎఫ్‌పీఎస్ ద్వారా నీట్, ఎంసెట్, ఈఎంబీఐఈ, కేసెట్, టీసెట్ పోటీ పరీక్షలకు అనుగుణంగా ఒత్తిడి లేని విద్యా బోధన జరుగుతోంది. ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. – తారావాణి, ప్రిన్సిపాల్

ఉపాధి అవకాశాల కోసం ఒకేషనల్ కోర్సు



ఒకేషనల్ కోర్సు అభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. విద్యార్థుల నైపుణ్యం ఆధారంగా వారు ఏ రంగంలో ముందుంటారో గమనించి దానికి అనుగుణంగా కోర్సులో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. టైపింగ్, షార్ట్ హ్యాండ్‌తో పాటు ఇతర ఉపాధి ఉద్యోగాలకు అవసరమైన పరిజ్ఞానం పెంపొందించుకునేలా విద్యార్థులకు శిక్షణ, బోధన ఉంటుంది. – రమణారెడ్డి

పేద విద్యార్థులకు మంచి చదువులు



లక్షలు పెట్టి చదువుకొంటున్న ఈ రోజుల్లో పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో మంచి బోధన అందుబాటులో ఉంది. స్వేచ్ఛాయుత వాతావరణంలో తరగతులు జరుగుతాయి. ప్రభుత్వం సౌకర్యాల కల్పనకు నాడు–నేడు నిధులు మంజూరు చేయడంతో అన్ని వసతులు సమకూరాయి. మొక్కలు నాటడం, వాటి సంరక్షణ నిత్యం జరుగుతూనే ఉండటంతో పరిసరాలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. – సకినాబీ, అధ్యాపకురాలు


గ్రంథాలయం


పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ

ప్రతిభను గుర్తించి లక్ష్యాన్ని చేరుకోవాలి

- ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్
- 127 మంది పోలీసు కుటుంబాల విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ

ఒంగోలు టౌన్: ప్రతిఒక్కరిలోనూ అద్భుతమైన ప్రతిభా పాటవాలు దాగి ఉంటాయని, వాటిని గుర్తించి మెరుగుపడితే సులువుగా లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అన్నారు. విద్యార్థులు వారికిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. చదువు మీద ఇష్టాన్ని పెంచుకోవాలని, ఇష్టమైనదేదీ కష్టంగా ఉండదని అన్నారు. చదువులో ప్రతిభ కనబరిచిన 127 మంది పోలీసు కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆదివారం స్థానిక పోలీసు కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమాలో ప్రోత్సాహకాలు అందజేశారు. పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు, హోంగార్డు, డీపీఓ, ఔట్ సోర్సింగ్ సిబ్బంది కుటుంబాలకు చెందిన 1 నుంచి ఇంటర్, డిగ్రీ విద్యార్థులతో పాటు క్రీడా విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ... విద్యార్థులు చదువులో క్రమశిక్షణ, హేతుబద్ధత, విశ్లేషణను అలవరచుకోవాలని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని, బాధ్యత కలిగిన పౌరులుగా ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. వృత్తిపరమైన ఒత్తిడితో కుటుంబాలతో ఎక్కువ సేపు పోలీసులు గడపలేరని, అయినప్పటికీ కొంత మంది పోలీసులు తమ పిల్లలకు చక్కటి గైడ్‌లైన్స్ ఇస్తూ వారికి అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పిల్లలు బాగా చదవాలని, తలిదండ్రులకు, జిల్లాకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ప్రముఖ పర్సనాలిటీ డెవల్మెంట్ నిపుణుడు వెల్‌విషర్ శంకర్ చెప్పారు. బాడీ లాంగ్వేజ్, కాన్సంట్రేషన్, మాట్లాడే తీరు, లక్ష్యాలను నిర్దేశించుకోవడం గురించి పలు విషయాలను ఆయన వివరించారు. అనంతరం విద్యార్థులకు కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డీపీఓ ఏఓ ఎం.సులోచన, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ సీఐ భీమానాయక్, పీసీఆర్ సీఐ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐలు సీతారామిరెడ్డి, రమేష్‌కృష్ణ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోలీసు కుటుంబాల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

బీచ్ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

చినగంజాం: ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని ఆదివారం చినగంజాంలోని సోపిరాల రామకోటేశ్వరస్వామి దేవస్థాన ప్రాగణంలో నిర్వహించారు. 25 మంది బాలురు పాల్గొనగా 15 మందిని ఎంపిక చేశారు. 15 మంది బాలికలు హాజరవగా, ఏడుగురిని ఎంపిక చేశారు. వీరికి ఆగస్టు 1వ తేదీ వరకు రామకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కోచింగ్ ఇస్తారు. ప్రతిభ చూపిన ఆరుగురిని ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు.







చినుకు కురిసె.. ప్రకృతి మురిసె..!

చిటపట చినుకులు మొక్కలను మురిపిస్తున్నాయి. పచ్చని చెట్లపై నీటి బిందువులు ప్రకృతి ప్రేమికులను మైమరపిస్తున్నాయి. పరిమళాలు వెదజల్లుతున్న పూలను చినుకమ్మలు ముద్దాడుతున్నాయి. రంగురంగుల పూల అందాన్ని మరింత పెంచుతున్నాయి. మునురు వానలతో పర్యావరణం నూతన సొబగులతో కనువిందు చేస్తోంది. - సాక్షి, ఒంగోలు





